బీజేపీ గాంధీనగర్ డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా నవీన్

చిక్కడపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ గాంధీనగర్ డివిజన్ నూతన కమిటీని డివిజన్ పార్టీ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్ బుధవారం కార్పొరేటర్ కార్యాలయంలో ప్రకటించారు. డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఐ.సురేష్‌రాజు, బి.శివకుమార్, జి.విజయలక్ష్మి, డి.కుమార్, ప్రధానకార్యదర్శులుగా ఎం.శ్రీనివాసరావు, వడ్డపల్లి ఆనంద్‌రావు, కార్యదర్శులుగా నీరజ్ గైక్వాడ్, సీహెచ్.యాదగిరి, బి.లావణ్య, సంయుక్త రాణి, ఇ.ఆనంద్‌కుమార్‌ను నియమించారు. నూతన కమిటీ సభ్యులకు నవీన్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

కిరణ్ కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

చిక్కడపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కలుషితాహారంతో మృతిచెందిన కిరణ్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వికలాంగుల హక్కుల జాతీయవేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎర్రగడ్డలోని మానసిక ఆరోగ్య కేంద్రంలో కలుషితాహారంతో కిరణ్ మృతిచెందిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కలుషితాహారం వల్ల 71 మంది మానసిక రోగులు అస్వస్థతకు గురవడం దురదృష్టకరమన్నారు. సోమవారం వడ్డించిన ఆహారం వల్ల 71మందికి వాంతులు, విరేచనాలు అవుతున్నా అధికారులు సరిగా స్పందించలేదన్నారు. బాధ్యులపై 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం, 2017 మెంటల్ హెల్త్ కేర్ చట్టం ప్రకారం కఠినచర్యలు తీసుకోవాలన్నారు.



గోపూజలో పాల్గొన్న లైబ్రరీ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, లైబ్రరీ ఉద్యోగులు

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

చిక్కడపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి సిటీసెంట్రల్‌లైబ్రరీ ఆవరణలో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశన, దీక్షాధారణ, రుత్విక్‌వరుణ, యాగశాలప్రవేశం తదితర దీపారాధన కార్యక్రమాలు జరిగాయి. లైబ్రరీచైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పొట్లూరు పద్మజ, ఉద్యోగసంఘం నాయకులు బొల్లం మహేందర్, అవినాశ్‌రావు, వెంకటేశ్‌యాదవ్, శ్రీకాంత్‌యాదవ్, చంద్రకళ, సుబ్బలక్ష్మి, వెంకటేశ్వర్‌రెడ్డి, యాదమ్మ, విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా విగ్రహాల పున:ప్రతిష్ఠ



ప్రత్యేకపూజల్లో పాల్గొన్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ సబర్మతినగర్‌లో నల్లపోచమ్మ దేవాలయంలో రేణుకా ఎల్లమ్మ, నలపోచమ్మ విగ్రహాల పున:ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం కనులపండుగగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో గణపతిపూజ, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠాపన, పంచగవ్యాదివాసం, క్షీరాధివాసం, జలాధివాసం కార్యక్రమాలు జరిగాయి. ఈ ప్రత్యేకపూజల్లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బస్తీవాసులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు జీవై.గిరి పాల్గొన్నారు.

టీపీసీసీని విమర్శించే స్థాయి ఆయనకు లేదు



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్

బర్కత్‌పుర, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌ను విమర్శించే స్థాయి బీఆర్ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ నాయకుడు నగేష్ ముదిరాజ్‌కు లేదని, ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకుని, బహిరంగ క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ ప్రధానకార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతం మరచిపోయి, నగేష్ ముదిరాజ్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడని, మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వారు హెచ్చరించారు.

రాష్ట్రంలో కుంటుపడిన ప్రజారోగ్యం: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు సాయిబాబా

రాంనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఆరోగ్యానికి సరైన ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎటువంటి మార్పు లేక ప్రభుత్వ ఆస్పత్రులు ప్రత్యక్ష నరకకూపాలుగా మారాయని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ఆరోపించారు. బుధవారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యం పూర్తిగా కుంటుపడిపోయిందన్నారు. ఒకవైపు కరోనా విస్తరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారని అన్నారు. ఎర్రగడ్డ మానసిక చికిత్స కేంద్రంలో 70 మందికి పైగా కలుషిత ఆహారం తిని ఒక వ్యక్తి మరణించడం, కొంత మంది పరిస్థితి విషమంగా ఉన్నా ఆరోగ్య శాఖ మంత్రి ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీనేతలు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఆంజనేయస్వామి భారీ విగ్రహం



భారీ ఆంజనేయస్వామి విగ్రహం

చిక్కడపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని త్యాగరాయ గానసభలో ఉన్న 32 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి ఆధ్వర్యంలో ఇటీవల ఆంజనేయస్వామి విగ్రహానికి అందంగా రంగులు వేశారు. దీంతో విగ్రహాన్ని వీక్షించేందుకు నిత్యం అనేకమంది భక్తులు వస్తున్నారు. గానసభలో ఉన్న ఏడు హాళ్లలో కార్యక్రమాలు నిర్వహించేవారితో పాటు ప్రేక్షకులు, దారివెంట వెళ్లేవారు ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఫొటోలు దిగుతున్నారు. గానసభ దివంగత అధ్యక్షుడు కళా దీక్షితులు హయాంలో అంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గానసభకు ప్రధాన ఆకర్షణగా అంజనేయస్వామి విగ్రహం నిలుస్తుంది.

'పద్యనాటకాలపై ఆసక్తిని పెంచాలి'

చిక్కడపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యువతకు పద్యనాటకాల పట్ల ఆసక్తిని పెంచాలని కిన్నెర ఆర్ట్స్ అధినేత మద్దాళి రఘురామ్ అన్నారు. ఆరాధన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో దుర్యోధన మాయసభ- శయనదృశ్యం పద్యనాటక ప్రదర్శన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొని, నటులను సన్మానించిన రఘురామ్ మాట్లాడారు. మన సంస్కృతిని, సంప్రదాయాలను తెలియజేసే పద్యనాటకాల పట్ల యువత ఆకర్షితులను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు లోకం కృష్ణయ్య, గుదిబండి వెంకటరెడ్డి, లంక లక్ష్మీనారాయణ, నిర్మలప్రభాకర్, వెంకట్రావు, బుర్రా మోహనకృష్ణ, చాగంటి సాయిలక్ష్మి, రామారావు, భాగిశాస్త్రి, నామా చంద్రబాబునాయుడు, పరమేశ్వర్, రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో
రంగానగర్ వాంబే ఇళ్లు



శిథిలావస్థకు చేరుకున్న రంగానగర్ వాంబే ఇళ్లు



పెచ్చులూడిన స్లాబ్

- స్లాబ్, పిల్లర్ల నుంచి ఊడుతున్న పెచ్చులు
- ప్రమాదపు అంచుల్లో 44 కుటుంబాలు
- మా ప్రాణాలను కాపాడాలంటున్న ప్రజలు

ముషీరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లో వాంబే పథకం కింద మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఇళ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు కూలుతాయో... ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. కొంతమంది భయంతో ఇళ్లు ఖాళీచేసి వెళ్లిపోయారు. భవనం స్లాబ్ పెచ్చులూడడం, పిల్లర్లు సైతం బీటలు బారి, ఇనుపరాడ్లు కనిపిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 3వ అంతస్తులో స్లాబ్ ఎప్పుడు కూలుతుందోనని భయంతో స్థానికులు కట్టెలు అడ్డంగా పెట్టి భవనం పైకప్పు కూలకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడుతున్న రంగానగర్ వాసులు

ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు

శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను ఖాళీచేయాలని 44 కుటుంబాలకు జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీచేశారు. వారం రోజుల్లో ఖాళీచేయాలని ఆదేశించారు. దీనితో తాము ఎక్కడికి వెళ్లాలి, ఎక్కడ ఉండాలని బాధితులు ఆందోళన చెందుతున్నారు.

శిథిలావస్థలో భవనం

రంగానగర్‌లో 1998వ సంవత్సరంలో అప్పటి కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి వాంబే ఇళ్లను ప్రారంభించారు. జీప్లస్-3 భవనం నిర్మించి 44 కుటుంబాలకు ఒక్క ఫ్లోర్‌కు 11 కుటుంబాలకు చొప్పున ఇళ్లను కేటాయించారు. వీరంతా ఆటోడ్రైవర్లు, రిక్షాకార్మికులు ఇళ్లలో పాచిపని చేసేవారే నివసిస్తున్నారు. మూడో అంతస్తులో స్లాబ్ పెచ్చులు ఊడడం, పిల్లర్లు పూర్తిగా దెబ్బతినడం, వర్షానికి ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెచ్చులూడిన ప్రతిసారి ప్రమాదాలకు లోనవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భవనం పిల్లర్‌కు బీటలు

ముషీరాబాద్ తహసీల్దార్‌కు వినతి

రంగానగర్‌లో శిథిలావస్థకు చేరుకున్న భవనాల వల్ల ప్రమాదం పొంచి ఉందని తమకు న్యాయం చేయాలని కోరుతూ రంగానగర్ వెల్ఫేర్‌అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ముషీరాబాద్ తహసీల్దార్ రాణా ప్రతాప్ ఎసింగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌వో మాట్లాడుతూ... ప్రమాదంగా ఉన్న ఇళ్లను ఖాళీ చేసి వెళ్లాలని సూచించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్థానికులకు సూచించారు. ఎంఆర్‌వోను కలిసిన వారిలో బాధితులు ప్రవీణ్, మహేష్, రాధిక తదితరులు ఉన్నారు.

ఇళ్లు ఖాళీచేయమని అధికారులు నోటీసులు ఇచ్చారు



జీహెచ్ఎంసీ అధికారులు ఇళ్లు ఖాళీచేయమని గతనెల 25వ తేదీన నోటీసులు ఇచ్చారు. ఉన్నపలంగా ఇళ్లు ఖాళీచేయమంటే ఎలా? మాకు పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలి.

\- సుజాత, బాధితురాలు

పెచ్చులు ఊడుతున్న స్లాబ్



భవనం స్లాబ్ పెచ్చులు ఊడి కిందపడడంతో ప్రమాదాలకు లోనవుతున్నాం. ఇప్పటికే పలు మార్లు మరమ్మతు పనులు చేయించినా, మళ్లీ మళ్లీ ఊడిపోతున్నాయి. ఇంట్లో భయంతో బతుకుతున్నాం.

\- మల్లేష్, బాధితుడు

బాధితులందరికీ పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలి



శిథిలావస్థకు చేరుకున్న రంగానగర్ వాంబే ఇళ్లను తొలగించి బాధితులందరికీ పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలి. ఈ భవనంలో అందరూ పేదప్రజలు నివసిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

\- వై.శ్రీనివాస్‌రావు, రంగానగర్, బస్తీ అధ్యక్షుడు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం



రంగానగర్ వాంబే ఇళ్ల దుస్థితిపై బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. 44 కుటుంబాలకు న్యాయం చేస్తాం.

\- ముఠా గోపాల్, ఎమ్మెల్యే

అన్ని పార్టీలు బీసీలకు మద్దతు ఇవ్వాలి: ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయాలని లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఒకవేళ ప్రభుత్వం రిజర్వేషన్లు పెంచకపోతే గ్రామస్థాయి నుంచి ఉద్యమాలకు సిద్ధం కావాలని బీసీలకు ఆయన పిలుపునిచ్చారు. 42 శాతం పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో 14 బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఆర్.కృష్ణయ్య ప్రత్యేక లేఖ రాశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యేడాది క్రితమే స్థానిక సంస్థల ఎన్నికలు జరగాల్సి ఉండగా రిజర్వేషన్ల పెంపు వల్ల వాయిదా పడుతోందన్నారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల విషయం పూర్తిగా పరిష్కారం కాలేదని రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలకు వెళ్లడం న్యాయం కాదన్నారు. అన్ని పార్టీలు బీసీ రిజర్వేషన్ల విషయంలో తమ వైఖరి స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేశారని, కానీ ఇంత వరకు జీవో జారీ చేయలేదని ఆరోపించారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది కానీ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రంపై నెట్టి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, నాయకులు జి.అనంతయ్య, రామ్మూర్తి, రాందేవ్‌మోదీ, మణికంఠ, గొరిగే మల్లేష్‌యాదవ్, సి.రాజేందర్, నిమ్మల వీరన్న, రాంకోటి ముదిరాజ్, నర్సింహగౌడ్, బర్క కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

9న అఖిలపక్ష సమావేశం



కిషన్‌రెడ్డికి ఆహ్వానపత్రం అందజేస్తున్న సత్యనారాయణ తదితరులు

రాంనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా-గోదావరి జలాల అధికారిక దోపిడీకి వ్యతిరేకంగా ఈ నెల 9న అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ తెలిపారు. బుధవారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి అఖిలపక్ష సమావేశంలో పాల్గొనాలని ఆహ్వానించినట్లు తెలిపారు. అదేవిధంగా టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, మాజీ స్పీకర్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనచారి, సీపీఐ మాజీ ఎంపీ ఆజీజ్‌పాషాను ఆహ్వానించామన్నరు. ఈ నెల 24న జరిగే తెలుగు రాష్ట్రాల సంయుక్త సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు వ్యూహాత్మకంగా కేంద్ర జల సంఘం సమావేశం ద్వారా గోదావరి - కావేరి నదుల అనుసంధానం పేరిట పోలవరం, బనకర్ల రెగ్యులరేటరి ప్రాజెక్టుల పేర గోదావరి నీటిని పెద్దఎత్తున వినియోగించుకునే కుట్ర జరుగుతుందన్నారు. దీనిపై ఏకాభిప్రాయానికి ఈ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

టీఓఏఏ కమిటీ సభ్యుడిగా రాఘుసందేశ్

ముషీరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ ఆర్బిట్రేషన్(టీఓఏఏ) కమిటీ సభ్యుడిగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది రాఘసందేశ్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మల్లారెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా రాఘసందేశ్ మాట్లాడుతూ... క్రీడారంగంలో ఏర్పడే చట్టపరమైన ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి సతీష్‌గౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో అధ్వానపు రోడ్ల ఆధునికీకరణ

ముషీరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌లో అధ్వానస్థితికి చేరుకున్న రోడ్లను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధిచేస్తున్నామని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ గౌసుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం భోలక్‌పూర్‌లో అధ్వానంగా మారిన రోడ్ల ఆధునికీకరణ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్‌లోని బంగ్లాదేశ్ మార్కెట్, అంజుమన్‌వీధి, రంగానగర్, బొంతబస్తీ ప్రాంతాల్లో డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తిఅయిన వెంటనే సీసీరోడ్ల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు షరీఫ్, దావుద్, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

100 మందితో శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్



స్పెషల్ డ్రైవ్‌లో చెట్ల కొమ్మలు, మట్టిదిబ్బలు, చెత్తను ఎత్తుతున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

రాంనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ ముందస్తు వర్షాకాలం నేపథ్యంలో ముషీరాబాద్ నియోజకవర్గంలో సుమారు వందమంది సిబ్బందితో బుధవారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అడిక్‌మెట్ డివిజన్‌లోని లలితానగర్‌లో జీహెచ్ఎంసీ కార్మికులు ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎంహెచ్‌ఓ ప్రవీణ, శానిటేషన్ ఎస్ఎఫ్ఐ చంద్రశేఖర్, నవీన్‌బాబు, గంగాధర్, శ్రీధర్‌రెడ్డి, హరికుమార్, జీహెచ్ఎంసీ సిబ్బంది కాలనీలో ప్రత్యక్షంగా మట్టి, ఇసుక, చెత్తకుప్పలను ఎత్తివేశారు. ఫుట్‌పాత్‌లపై వెలిసిన చెట్లకొమ్మలను మట్టిదిబ్బలను తొలగించి పరిసర ప్రాంతాలను శుభ్రంగా తయారు చేశారు. ఈనెల 2 నుంచి 20వ తేదీ వరకు ఈ ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ ఎం.డి.అంజాద్, నీల, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాన విభావరి



రికార్డులను ప్రవీణ్‌కుమార్‌కు అందజేస్తున్న ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీగేయ రచయిత చంద్రబోస్

చిక్కడపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రవీణ్‌కుమార్ మ్యూజికల్స్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో నిర్వహించిన గానవిభావరి అలరించింది. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు కార్యక్రమం జరిగింది. నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్‌తోపాటు పలువురు గాయనీమణులు మొత్తం 102 గీతాలు ఆలపించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ఆస్కార్ అవార్డుగ్రహీత, సినీగేయ రచయిత చంద్రబోస్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, ఆయనను సన్మానించారు. చంద్రబోస్ మాట్లాడుతూ ప్రవీణ్‌కుమార్ అద్భుతగాయకుడని అభినందించారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకులు సాయికార్తీక్, విజయలక్ష్మి, బింగి నరేందర్ గౌడ్ పాల్గొన్నారు. 12 గంటలపాటు సాగిన కార్యక్రమానికి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ తదితర మూడు రికార్డులు దక్కాయి.

ముందస్తు వైద్య పరీక్షలు.. వ్యాధుల నివారణకు దోహదం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సరస్వతి, డాక్టర్ మనోజ్‌రెడ్డి

ముషీరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ముందస్తుగా వైద్యపరీక్షలు చేసుకోవడంతో వ్యాధులను సకాలంలో గుర్తించి నివారించవచ్చని ప్రభుత్వ ఎయిడ్స్ అండ్ లెప్రసీ కంట్రోల్ డిపార్టుమెంట్ అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సరస్వతి సూచించారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్ బాకారం బస్తీ దావఖానాలో ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపియన్ నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ ముక్తభారత్ అభియాన్ స్క్రీనింగ్ కార్యక్రమంతో పాటు హెచ్ఐవీ, లెప్రసీకి సంబంధిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ సరస్వతి మాట్లాడుతూ... ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపియన్‌లో ఒకేసారి రోగాలకు అన్నిరకాల పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి, బాకారం బస్తీదవాఖాన వైద్యాధికారిణి డాక్టర్ వాసిని, వైద్యసిబ్బంది పార్వతి, విజయ్‌కుమారి, టీబీ యూనిట్, ముషీరాబాద్ సూపర్‌వైజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

కళలకు నిలయం గానసభ



సంయుక్తను సన్మానిస్తున్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు

చిక్కడపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): త్యాగరాయ గానసభలోని ఏడు వేదికల్లో కళా ప్రదర్శనలు, పలురంగాల్లో ప్రముఖుల చిత్రపటాలు ఆడిటోరియంలో ఏర్పాటుతో గానసభ కళలకు నిలయంగా, కళామయంగా మారిందని హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. ఎందరో మహానుభావులు పేరిట గత కాలపుప్రఖ్యాతులను స్మరిస్తూ చేస్తున్న కార్యక్రమాలు అద్వితీయమన్నారు. గానసభ వ్యవస్థాపక దినోత్సవం కార్యక్రమం బుధవారం జరిగింది. సంగీత గురువు సంయుక్త శిష్యబృందంతో త్యాగరాజస్వామి కీర్తనల ఆలాపన గానగోష్ఠి కార్యక్రమం ఆకట్టుకుంది. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ గానసభను ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం తేవడానికి కృషి చేస్తున్నామన్నారు. కళాకారులు, కళలను, సాహితీవేత్తలను ప్రోత్సహిస్తూ గానసభను మరింత అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. తొలిప్రదర్శన గానసభలో ఇచ్చి దేశవిదేశాల్లో ప్రదర్శనలకు వివిధ రంగాలవారు వెళ్లేవారన్నారు. ఐదున్నర దశాబ్దాలకు పైగా పలు సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక కల్పిస్తూ గానసభ ప్రతిష్ఠను ఇనుమడింపచేస్తున్నామన్నారు. గానసభ 59 ఏళ్ల ప్రయాణంలో ప్రఖ్యాత సంగీత నృత్య నాటక కళాకారులు ప్రదర్శన ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువు సంయుక్తను సన్మానించారు. గానసభ పాలకమండలి సభ్యులు గుండవరపు గీతాదేవి, గానసభ సభ్యులు శంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ జయరాంరెడ్డికి నివాళి



జయరాంరెడి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గోపాల్

రాంనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ దివంగత జయరాంరెడ్డి జయంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ హేమలత జయరాంరెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నేత శ్రీనివాస్, జెల్ల భిక్షపతి, మేడి సత్యనారాయణ, రాజు, అబ్బు, రింకు, జ్ఞాని, సాయిగౌడ్, ధర్మలక్ష్మీపతి, టైలర్ శ్రీను, నగేష్, నాగరాజు, ఆస్లాం, మున్నా, ఆసిఫ్, ప్రేమలతరెడ్డి, విజయ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

లంబాడీ బస్తీలో ఉచిత వైద్య శిబిరం

రాంనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్వాంతన చారిటబుల్ ట్రస్ట్, గడ్డి రామోజీ ఫౌండేషన్, కిమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని లంబాడీ బస్తీ కమ్యూనిటీహాల్‌లో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కిమ్స్ ఆస్పత్రి నుంచి వచ్చిన జనరల్ ఫిజిషియన్, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్ వైద్యులు 130 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షించారు. ఆరోగ్య సలహాల ఇచ్చి, మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వీకే.శబరి మాట్లాడుతూ పేద ప్రజలు నివసించే ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కె.రమేష్, ఎ.పద్మ, వీరయ్య, సైదులు, శ్రీనివాస్‌రావ, జె.విక్రమ్, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, లావణ్య పాల్గొన్నారు.